

# అడుగుపడితే అపాయం

## - కొమ్మూరి సాంబశివరావు



(గత సంచిక తరువాయి)

11

**కిటికీలోంచి ఎండ** మొహం మీద పడటం వల్ల లక్ష్మికి మెలుకువ వచ్చింది. కళ్ళు చిట్లించి మొహం తిప్పేసుకుంది. కిటికీ తెర వేయనందుకు పనిమనిషిని కోప్పడాలి అనుకుంటూ కళ్ళు తెరిచి చూసింది. అది తన గదికాదు. తన పడకగది గోడలకి నీలంరంగు వేయించింది. తనున్న గది గోడలు తెల్లగా వున్నాయి. చటుక్కున లేచి కూర్చుని చుట్టూ చూసింది పరీక్షగా. అప్పుడు జ్ఞాపకం వచ్చింది రాత్రి జరిగినదంతా, ఎవరో తన పడకగదిలోకి రావడం.

లేచి వెళ్ళి తలుపు తెరిచింది. తలుపుకి అవతల నీళ్ళ గది వుంది. మొహం కడుక్కుని, జుట్టు దువ్వుకుని, పౌడర్ వేసుకుని మళ్ళీ పడకగదిలోకి వచ్చింది. ఇంకో తలుపు లాగింది. లాగగానే తెరుచుకుంది.

పెద్దహాలు. కింద తివాసీలు పరచివున్నాయి. గోడల కానించి సోఫాలు పైన ఫాన్, ఓ బల్లమీద రేడియో, చాలా వైభవంగా వుంది గది.

నాలుగడుగులు ముందుకు నడిచింది లక్ష్మి.

"ఎవరు?" అంటూ సోఫాలోంచి లేచి, లక్ష్మిని చూసి, "మీరా! మీరేనన్నమాట నన్ను ఇక్కడికి తీసుకొచ్చింది" అంది నళిని.

నిప్పులు కక్కుతూ ఆమెని చూసి "నువ్వా! ఇది ఎవరి యిల్లు? నేనిక్కడికి ఎలా వచ్చాను" అడిగింది లక్ష్మి.

లక్ష్మిని పరీక్షగా చూస్తూ "నిజంగా మీకేమీ తెలియదా? నాలాగే మిమ్మల్ని ఎవరో ఇక్కడికి ఎత్తుకు వచ్చారా?" అడిగింది నళిని.

లక్ష్మి జవాబు చెప్పేలోగా ఇరవయి ఏళ్ళ అందమైన అమ్మాయి హాల్లోకి వచ్చి, "కాఫీ అండ్ బ్రేక్ ఫాస్ట్ రెడీ. డైనింగ్ రూములోకి వస్తారా, ఇక్కడికే తెచ్చి ఇవ్వనా?" అడిగింది మర్యాదగా. కత్తిరింపు జుట్టు, గౌను, బూట్స్‌లు ఆంగ్లో ఇండియన్ యువతి.

"నువ్వు ఎవరు? ఈ ఇల్లెవరిది? మమ్మల్ని ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు?" అడిగింది లక్ష్మి.

"దయచేసి నన్నేమీ అడగకండి. నాకేమీ తెలియదు. ఇక్కడికే తెచ్చి ఇస్తాను" అని ఆమె వెనక్కి తిరిగింది.

భార్గవప్రసాద్ పిలుచుకు రమ్మన్నారని తనకి చెప్పి క్లోరోఫాం వాసన చూపించి, స్పృహ పోగొట్టి అక్కడికి తీసుకొచ్చారని నళిని చెప్పింది.

తను ఎలా అక్కడికి వచ్చినదీ చెప్పి, "వీళ్ళెవరో? మనల్ని ఎందుకు ఎత్తుకొచ్చారో" అంది లక్ష్మి.

"దయచేసి నన్నేమీ అడగకండి .నాకేమీ తెలియదు. ఇక్కడికే తెచ్చి ఇస్తాను" అని ఆమె వెనక్కి తిరిగింది.

భార్గవప్రసాద్ పిలుచుకు రమ్మన్నారని తనకి చెప్పి క్లోరోఫాం వాసన చూపించి, స్పృహపోగొట్టి అక్కడికి తీసుకొచ్చారని నళిని చెప్పింది.

తను ఎలా అక్కడికి వచ్చినదీ చెప్పి, "వీళ్ళెవరో మనల్ని ఎందుకు ఎత్తుకొచ్చారో" అంది లక్ష్మి.

"ఎవరయినా మనకి హాని చెయ్యాలని కాదనుకుంటాను. కాఫీ, టిఫిన్ కూడా ఏర్పాటు చేసారు" నళిని అంటుండగా ఆంగ్లో ఇండియన్ యువతి ఒక ట్రే తెచ్చి బల్లమీద పెట్టి "నా పేరు ఏంజల్. అవసరమయితే పిలవండి డైనింగ్ రూములో వుంటాను" అని వెళ్ళిపోయింది.

అంతలో మెట్లమీద చప్పుడయింది. ఇద్దరూ అటు తిరిగారు. "గుడ్ గాడ్ ప్రొప్రయిటర్" అంది నళిని.

"యుగంధర్‌గారు కూడా" అంది లక్ష్మి.

ఇద్దరూ మెట్ల దగ్గరికి పరిగెత్తారు.

"మీరిద్దరూ ఇక్కడికి ఎలా వచ్చారు?" అడిగాడు భార్గవప్రసాద్ ఆశ్చర్యంతో.

నళిని చెప్పింది.

భార్గవప్రసాద్ యుగంధర్ ముఖం చూశాడు.

యుగంధర్ నవ్వి, "మనల్ని ఎత్తుకు వచ్చిన మనిషి ఉద్దేశ్యం ఏమైనా ప్రస్తుతానికి మనకి హాని చేయడం అతని ఉద్దేశ్యం కాదు. కనుక మనం ముందు కాఫీ తాగి తరవాత మిగతా విషయాలు ఆలోచిద్దాం" అన్నాడు.

నళిని ముందు వెళ్ళింది డైనింగ్ రూం వేపు. తతిమ్మా వాళ్ళు ఆమె వెనకే వెళ్ళారు.

"చూడండి ఇక్కడ ఎవరున్నారో?" అంది నళిని ఆశ్చర్యంతో.

"ఎవరు ఆయన" అన్నాడు యుగంధర్ డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని, ఇడ్డెన్లు తింటున్న యాభై ఏళ్ళ మనిషిని చూసి.

అతను నవ్వి "ఇడ్లీలు బాగున్నాయి. తింటారా" అన్నాడు.

"ఈయన సత్యనారాయణ. మా న్యూస్ ఎడిటర్. ఈయన డిటెక్టివ్ యుగంధర్. మీరిక్కడ ఏం చేస్తున్నారు" అడిగాడు భార్గవప్రసాద్ సత్యనారాయణ్ణి.

"నేను ఆఫీసునుండి ఇంటికి వెళుతూవుంటే ఎవరో ఒకతను వచ్చి మీరు నళిని ఇంటిలో ఉన్నారనీ, వెంటనే నన్ను రమ్మన్నారనీ చెప్పాడు. అతని మాట నమ్మి అతను తెచ్చిన కారు ఎక్కాను. కారులో ఇంకో అతను వున్నాడు. కారు కదలగానే నా ముఖం మీద మత్తుమందు జల్లాడు. తరవాత మళ్ళీ స్పృహలోకి వచ్చేటప్పటికి ఈ యింటిలో మేడమీద గదిలో వున్నాను. కిందికి దిగిరాగనే ఒక అందమైన ఆంగ్లో ఇండియన్ అమ్మాయి ఎదురయి డైనింగ్ రూములోకి వచ్చి కాఫీ టిఫిన్ తీసుకోమని చెప్పింది. అంతే నాకు తెలిసింది. మీరంతా ఇక్కడికెలా వచ్చారు?" అడిగాడు సత్యనారాయణ.

"మీలాగే స్పృహ పోగొట్టి మమ్మల్నీ యిక్కడికి తీసుకొచ్చారు" చెప్పాడు యుగంధర్.

అందరూ కుర్చీల్లో కూర్చున్నారు. ఆ ఆంగ్లో ఇండియన్ ట్రేలోంచి పళ్ళాలు తీసి అందరిముందూ పెట్టింది. పళ్ళాలలో ఇడ్లీలు వున్నాయి. తరవాత కాఫీ తెచ్చింది. కాఫీ తాగుతుండగా సిగరెట్ డబ్బాలు తెచ్చి బల్లమీద పెట్టింది.

"ఈ ఇంట్లో ఇంకెవరయినా వున్నారేమో అడుగుదాం ఈమెని" అన్నాడు యుగంధర్.

"ప్రయోజనం లేదు. ఆమె మాట్లాడదు" అన్నాడు సత్యనారాయణ.

అవును అంది నళిని.

అంతలో రేడియోలోంచి వినిపించినట్లు "ఫ్రెండ్స్ ఎటెన్షన్ ప్లీజ్" అన్న మాటలు వినిపించాయి.

అందరూ చుట్టూచూశారు, ఎవరూ లేరు. అది మొగ గొంతు.

గోడకి తగిలించి వున్న లౌడ్ స్పీకర్ చూపించాడు యుగంధర్.

"మీకెవరికీ ఎటువంటి హానీ జరగదు. మిమ్మల్ని యిక్కడికి తీసుకొచ్చి బంధించడం కూడా నాకు ఇష్టంలేదు. కాని తప్పనిసరి అయింది. మీకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులూ ఏర్పాటు చేయించాను. మీకేదయినా కావలిస్తే ఏంజల్‌కి చెప్పండి తెప్పించి ఇస్తుంది .ఈ యింట్లోంచి తప్పించుకోవడానికి ప్రయత్నించకండి. ముఖ్యంగా యుగంధర్, మీకు చెపుతున్నాను. ఎవరయినా తోటలోకెళితే కుక్కలు మీద పడి చీల్చేస్తాయి. నా హెచ్చరిక వినకుండా ప్రవర్తిస్తే ఆ బాధ్యత మీదే. తరవాత నన్ను నిందించి ప్రయోజనం లేదు."

"మేము మాట్లాడే మాటలు మీకు వినబడే ఏర్పాటు కూడా చేశారా?" అడిగాడు యుగంధర్.

"ఆఁ, వినబడతాయి."

"మీరు మీ ఇంట్లోంచే మాట్లాడ్తున్నారా?"

చిన్న నవ్వు 'చెప్పను ' అన్న మాట వినిపించింది.

"మమ్మల్నందరినీ యిక్కడికి ఎందుకు తీసుకు వచ్చారు?" యుగంధర్ ప్రశ్న.

"చెపుతాను జాగ్రత్తగా వినండి. ఫిరోజ్ కమ్యూనిస్టు చైనా ప్రభుత్వం అణుశక్తి పరిశోధన కేంద్రంలో ఉద్యోగి అని నాకు తెలుసు. రెండేళ్ళనించి అతన్ని నేనో కంట కనిపెడ్తూనే వున్నాను. సిలోన్‌నించి అతడు పారిపోయాడని తెలుసు. ఈదేశానికి వచ్చి వుంటాడని ఊహించి, నేనూ, నా అనుచరులూ వెయ్యి కళ్ళతో చూస్తున్నాము. అపుడు నాకో వార్త వచ్చింది, ఫిరోజ్ మద్రాసు వచ్చాడనీ, భార్గవప్రసాద్‌గారిని కలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాడనీ. అతడు మద్రాసులో ఎక్కడ ఉన్నదీ నాకు తెలియదు. అందువల్ల భార్గవప్రసాద్‌గారిని ఓ కంట కనిపెట్టవలసి వచ్చింది" సాయంకాలం భార్గవప్రసాద్‌గారు ఆఫీసునుండి ఇంటికెళ్ళడం, రాత్రి ఎప్పుడో ఇంటినించి బయలుదేరడం, గ్రాండ్ హోటల్ ప్రాంతాలకెళ్ళి ఫిరోజ్‌ని కారు ఎక్కించుకుని బీచ్‌కి వెళ్ళడం, కారు మళ్ళీ గ్రాండ్ హోటల్ ప్రాంతాలకు రావడం, కారులో ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకోవడం అంతా నాకు తెలుసు. నేను వాళ్ళ కారుని వెంబడిస్తూనే వున్నాను.

ఫిరోజ్ ఏవో కొన్ని రహస్యాలు భార్గప్రసాద్‌గారికి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని గ్రహించాను. ఫిరోజ్ వెనకే నేనూ గ్రాండ్ హోటల్లోకి వెళ్ళాను. అతడు తన గదిలోకెళ్ళి తలుపు మూసేశాడు.

అతని గదిలోకెళ్ళి అతన్ని బెదిరించో, డబ్బు ఇస్తానని ఆశ చూపించో ఆ రహస్యాలు తెలుసుకుందామా లేక భార్గవప్రసాద్‌గారికి అతడు ఆ రహస్యాలు తెలిపిన తరవాత ఆయనతో బేరమాడి ఆ రహస్యాలు ఆయన దగ్గర కొనుక్కుందామా, ఏది మంచిదీ అని ఆలోచిస్తూ హోటలు నడవాలో నిలబడ్డాను.

నేనింకా ఓ నిర్ణయానికి రాకముందే ఎవరో వస్తున్న అలికిడయింది. చటుక్కున ఖాళీగా వున్న ఎదురు గదిలోకి వెళ్ళి తలుపు మూసేశాడు.

అతని గదిలోకెళ్ళి అతన్ని బెదిరించో, డబ్బు ఇస్తానని ఆశ చూపించో ఆ రహస్యాలు తెలుసుకుందామా లేక భార్గవప్రసాద్‌గారికి అతడు ఆ రహస్యాలు తెలిపిన తరవాత ఆయనతో బేరమాడి ఆ రహస్యాలు ఆయన దగ్గర కొనుక్కుందామా, ఏది మంచిదీ అని ఆలోచిస్తూ హోటలు నడవాలో నిలబడ్డాను.

నేనింకా ఓ నిర్ణయానికి రాకముందే ఎవరో వస్తున్న అలికిడయింది. చటుక్కున ఖాళీగా వున్న ఎదురు గదిలోకి వెళ్ళి, తలుపు కొద్దిగా తెరిచిపెట్టి సందులోంచి చూశాను. ఎవరో ఇద్దరు ఫిరోజ్ గది తలుపు తట్టారు. అర నిమిషం తరవాత గదిలోకెళ్ళారు. పది నిమిషాలు గడిచాయి. ఇద్దరూ బయటకొచ్చారు. అప్పుడు వారి మొహాలు స్పష్టంగా కనబడ్డాయి నాకు. వాళ్ళిద్దరూ చైనీయులు. వేషం రూపం ఎంత మార్చుకున్నా నేను వాళ్ళని పసిగట్టగలిగాను. ఇదివరకు వాళ్ళిద్దరికీ, నాకూ సింగపూర్‌లో ఘర్షణ జరిగింది.

ఆలోచించేందుకు వ్యవధిలేదు. ఫిరోజ్ గదిలోంచి వస్తున్నారు. వెంటాడి ప్రయోజనం లేదు దొరకరు. వారిని ఆటకాయించటానికి నిశ్చయించుకున్నాను. జేబులోంచి పిస్తోలు తీసి పట్టుకున్నాను. నేనున్న గదిముందునించి వాళ్ళు వెళుతుండగా ఇద్దరినీ తలల మీద కొట్టి, వాళ్ళు కింద పడగానే గదిలోకి లాగేశాను. వారి జేబులు వెతికాను. ఒక్క కాగితం ముక్కకూడా కనిపించలేదు. డబ్బు తప్ప వారి జేబుల్లో ఇంకేమీ లేదు.

ఫిరోజ్ దగ్గరనించి వీళ్ళు యేమీ సంపాదించలేకపోయారా, ఏం జరిగింది అనుకుంటూ ఫిరోజ్ గదివేపు పరిగెత్తాను. తలుపు తొయ్యగానే తెరుచుకుంది. లోపల చూశాను ఫిరోజ్ లేదు. కిటికీ బార్లా తెరిచి వుంది. కిటికీ దగ్గరికి వెళ్ళి చూశాను. కింద రోడ్ మీద జనం చేరడం, అందరూ పైకి చూడటం గమనించి ఫిరోజ్‌ని కిటికీలోంచి కిందికి పడేశారని గ్రహించాను. ఇంకా నేను ఆ గదిలో వుంటే నన్ను పట్టుకుంటారు.

ఆ చైనీయులు యిద్దరూ పడివున్న గదిలోకి వెళ్ళాను. ఒకడికి అప్పుడే స్పృహ వస్తోంది. పిస్తోలు చూపించి నిజం చెప్పమని లేకపోతే చంపేస్తాననీ బెదిరించాను కాస్త బాధ తెలిసిన తరవాత ప్రాణ భయం కలిగిన తరవాత చెప్పాడు ఫిరోజ్ భార్గవ ప్రసాద్‌ని కలుసుకోబోతున్నాడని వారికి తెలిసిందట. కాని ఫిరోజ్ ఎక్కడున్నదీ తెలియలేదట. అందువల్ల వాళ్ళు

భార్గవప్రసాదుని వెంబడించారు. ఫిరోజ్‌ని గ్రాండ్ హోటల్ ప్రాంతాల్లో దింపడం చూసి అతన్ని వెంబడించారు. అతను చైనా ప్రభుత్వం ఫైల్స్‌లోంచి రికార్డులు దొంగిలించాడనీ, అతన్ని చంపెయ్యమనీ, ఆ రికార్డులు ఎవరికీ ఇవ్వకుండా ఆపమని వారిద్దరికీ ఆజ్ఞ ఇచ్చారట. వాళ్ళు గదిలోకెళ్ళి రికార్డులు ఇవ్వమనీ, లేకపోతే చంపేస్తామనీ ఫిరోజ్‌ని బెదిరించారట. అతడు భయపడిపోయి రికార్డులు యివ్వడానికి ఒప్పుకుని వాటిని ఎక్కడ దాచినదీ చెప్పాడట. వాళ్ళు అక్కడ చూస్తే అవి లేవు. ఫిరోజ్ తన జేబులోనే దాచుకుని వుంటాడని అనుకుని అతన్ని తలమీద పిస్తోలు పిడితో కొట్టారు. స్పృహపోగానే అతని జేబులు వెతికారు. కనిపించలేదు. మాతృదేశానికి ద్రోహం చేస్తున్న అతన్ని చంపెయ్యాలని నిర్ణయించుకున్నారు. అతను హత్య చేయబడినట్లు ఎవరికీ తెలియకూడదు. అందుకని కిటికీలోంచి శవాన్ని బయటకి పడేసి వచ్చేశారట. వాళ్ళు చెప్పింది నిజమేనని నాకు అనిపించి, నేను యింకా అక్కడ ఉండటం మంచిదికాదని వెళ్ళిపోయాను" చెప్పాడు లౌడ్ స్పీకర్లో మాట్లాడుతున్న అతను.

"మీరు ఏదో ఒక దేశం ప్రభుత్వం తరపున యీ పనులు చేస్తున్నారా?" అడిగాడు యుగంధర్.

"ప్లీజ్! అటువంటి ప్రశ్నలు అడగకండి."

"మమ్మల్నందరినీ యీ యింట్లో బంధించడానికి కారణం?"

"ఫిరోజ్ చైనానుంచి తెచ్చిన ఆ రికార్డులు మీలో ఎవరి దగ్గరో వున్నాయని నా అనుమానం."

"అటువంటి అనుమానానికి ఆధారాలు ఉన్నాయా?"

"ఉన్నాయి."

"అయితే ముందు నా విషయం చెప్పండి. నా దగ్గర వుండవచ్చని మీరు ఎందుకు అనుకుంటున్నారు?"

"క్షమించండి. అవసరమైన వేరే పని వచ్చింది. వెళ్ళాలి తరవాత చెపుతాను" లౌడ్ స్పీకర్లో మాటలు ఆగిపోయాయి.

"ఏమిటి కథ? చెప్పు" అడిగాడు రాజు పార్వతిని. అటూ యిటూ బెదురు చూపులు చూస్తోంది పార్వతి. మాట పెగిలి రావడంలేదు.

"ఇక నువ్వు యిక్కణ్ణించి పారిపోలేవు. ప్రయత్నించక" అన్నాడు రాజు.

అతనామాట అంటుండగానే బల్లమీది పేపరు వెయిటు తీసు రాజు మీదికి విసిరేసింది. చటుక్కున తల పక్కకి తీప్పేసుకున్నాడు రాజు. లేకపోతే ఆ దెబ్బకి నేల కూలేవాడు.

పార్వతి తలుపు వేపు పరిగెత్తింది. రాజు రెండు అంగల్లో వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. "చెప్పానుగా నువ్వు పారిపోలేవని" అన్నాడు.

రాజు పట్టు వొదిలించుకునేందుకు ప్రయత్నించింది. కాని ఫలించలేదు. చటుక్కున అతని చెయ్యి కొరికింది. రెండు పళ్ళు కండలోకి దిగాయి, రక్తం కారుతోంది. అయినా రాజు పట్టు వదలలేదు. "ఆడదాన్ని కొట్టడం నాకు యిష్టంలేదు. నువ్వు ఇలా మొండితనం చేశావంటే తప్పదు" అన్నాడు కోపంగా.

పార్వతి అతన్ని తప్పించుకుని పారిపోడానికి ప్రయత్నిస్తూనే వుంది. ఒక చేత్తో ఆమెని గట్టిగా చుట్టి పట్టుకుని, ఎత్తుకుని లోపలికి తీసుకు వెళ్ళాడు. పడకగదిలోకి వెళ్ళి మంచం మీద పడేశాడు. ఆమె లేవబోయింది. ఒక చేత్తో ఆమెని వెనక్కి తోసి, రెండో చేతితో ఆమె కాళ్ళకి దుప్పటి చుట్టేశాడు తరవాత ఆమె రెండు చేతులూ ఒక చేత్తో పట్టుకుని దిండు గలేబుతో కట్టేశాడు.

ఆ సమయానికి కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరు? నీ స్నేహితులా?" అడిగాడు రాజు.

"ఏమో" అన్నదామె.

తాళ్ళు తెచ్చి కదలడానికి వీలులేకుండా పార్వతిని మంచానికి కట్టేసి, అరవడానికి వీలులేకుండా నోటినిండా గుడ్డలు కుక్కి హాల్లోకి వెళ్ళాడు రాజు.

ఎంతమంది వచ్చారో కిటికీ తలుపు తెరిచి చూడవచ్చు. చూస్తే వాళ్ళూ తనని చూస్తారు. చూడగానే పారిపోతారు. వాళ్ళు ఎవరో తెలుసుకోవాలి. నెమ్మదిగా తలుపు గడియ లాగేశాడు. గోడకి ఆనుకుని తలుపు తెరిచాడు. తెరుచుకున్న తలుపు వెనక వున్నాడు రాజు. గుమ్మం అవతల వున్నవాళ్ళకి కనిపించడు. వాళ్ళు యిద్దరు. ఇద్దరూ లోపలికి వచ్చి "పార్వతీ" అని పిలిచి ఆమె కనిపించకపోయేసరికి చటుక్కున వెనక్కి తిరిగారు.

"చేతులు పైకెత్తి వుంచండి" అన్నాడు రాజు తలుపు మూసేసి.

రాజునీ, రాజు చేతిలో పిస్తోలునీ చూసి చేతులు పైకి యెత్తిపెట్టారు యిద్దరూ.

రాజు వాళ్ళ మొహాలు పరీక్షగా చూసాడు. చైనీయులు కారు. భారతీయులే.

"అలాగే చేతులు పైకి యెత్తి పెట్టి ఒక్కొక్క అడుగు వెనక్కి వెయ్యండి. ఊ! ఆగండి. ఆగి వెనక్కి తిరగండి. ముందుకి రాకండి. జిత్తులవల్ల ప్రయోజనం లేదు. నిర్దాక్షిణ్యంగా పిస్తోలు పేలుస్తాను, పిచ్చి వేషాలు వేస్తే" అని బెదిరిస్తూ యిద్దర్నీ పడకగదిలోకి తీసుకెళ్ళాడు.మంచానికి దూరంగా గోడకానుకుని నిలబడండి" ఆజ్ఞాపించాడు.

రాజు చెప్పినట్లు చేయక తప్పిందికాదు. పిస్తోలు వారి యిద్దరివైపు గురిపెట్టి వుంచి "చెప్పండి త్వరగా, మీరెవరు? మిమ్మల్ని ఎందుకు ఇప్పుడు కాల్చి చంపకూడదు?" అడిగాడు రాజు.

వాళ్ళు మాట్లాడలేదు. మంచం మీద పడివున్న పార్వతి రాజుని ఉరిమి చూస్తోంది. గిలగిలా కొట్టుకుంటోంది. ఓ క్షణం రాజు దృష్టి ఆమె మీదికి మళ్ళింది. ఆ ఒక్క క్షణంలో రాజు ప్రమాదానికి గురయ్యాడు. చిరుతపులుల్లా ఒక్క గంతేశారు. వాళ్ళిద్దరూ ఒక్కసారిగా రాజుమీద పడ్డారు. రాజు చేతిలో పిస్తోలు కిందపడింది. రాజూ కిందపడ్డాడు. వాళ్ళిద్దరూ రాజుమీద పడ్డారు. పడుతూనే రాజు మెడ పట్టుకున్నాడు ఒకడు. రెండోవాడు రాజు చేతులు బంధించి పెట్టాడు.

"పిసికెయ్యి. ఊపిరి ఆడకుండా గొంతు నలిపెయ్యి. చంపెయ్యి" అన్నాడొకడు.

రెండో అతను బలమంతా ఉపయోగించి రాజు మెడ నలిపేస్తున్నాడు.

రాజుకి ఊపిరి ఆడడంలేదు. చీకట్లు కమ్ముతున్నాయి. చెమటలు పోస్తున్నాయి. వాళ్ళు తనని ప్రాణాలతో వదలరని తెలుసు. ఎలా తప్పించుకోవడం ఏం చెయ్యాలి?

"మనం ఎవరమూ తప్పించుకునేందుకు వీలులేకుండా తలుపులూ కిటికీలు అన్నీ బిగించి వున్నాయి. ఎట్లాగో తప్పించుకున్నా బయటికి వెళ్ళగానే కుక్కలు చీల్చేస్తాయి. కనుక మనం చెయ్యగలిగింది యేమీలేదు. హోటల్లో వుంటున్నట్లు తృప్తిపడి తలోగదిలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకుందాం" అన్నాడు యుగంధర్.

అందరూ నిరాశతో చూశారు యుగంధర్ని. డిటెక్టివ్ యుగంధర్ మేధావి ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనయినా శత్రువులని వోడించి, తప్పించుకోగల సమర్థుడు. అటువంటి యుగంధరే అలా అంటే యేం చేయగలం అనుకున్నారు.

యుగంధర్ లేచి, సిగరెట్ వెలిగించి ఆలోచిస్తూ మేడమీదికి వెళ్ళాడు. ఓ గదిలోకి వెళ్ళి, తలుపులు మూసేసి, కుర్చీ మంచం దగ్గరకి లాక్కుని, కాళ్ళు మంచం మీదికి జాపి ఆలోచించడం ప్రారంభించాడు.

ఫిరోజ్ దగ్గరున్న రహస్య పత్రాలు చైనీస్ గూఢచారులకి దొరకలేదని చెప్పాడు లౌడ్ స్పీకరులో మాట్లాడిన అతను. అది నిజమే అయి వుంటుంది. లేకపోతే తమనందరినీ యిక్కడ ఎందుకు బంధిస్తాడు? ఫిరోజ్ భార్గవప్రసాద్‌ని కలుసుకునేందుకు వెళ్ళినప్పుడు ఆ పత్రాలు తనతో తీసుకువెళ్ళాడా లేక హోటల్లో తన గదిలో ఎక్కడో దాచిపెట్టి వెళ్ళాడా? హోటల్‌కి వచ్చిన తరవాత తనకి టెలిఫోన్ చేశాడు. తనని కలుసుకుంటానని చెప్పాడు. అప్పుడు ఆ పత్రాలు ఫిరోజ్ దగ్గర వున్నాయా! ఉన్నాయని నిర్ధారణ చేసుకునే తనకి ఫోన్ చేశాడా? లేక తను దాచి పెట్టిన చోట వున్నాయని అనుకుని తనకి ఫోన్ చేశాడా? ఆ పత్రాలు తనకూడా తీసుకువెళ్ళి వుంటే ఫిరోజ్ దగ్గరే వుండి వుండాలి. అప్పుడు చైనీస్ గూఢచారులకి అవి దొరికేవి. వాళ్ళకి దొరకలేదు. దొరకలేదని అనుకోవడానికి యింకో సూచన కూడా వుంది. తనని హత్య చేసి ఆ పత్రాలు తననించి సంపాదించడానికి ఆ రాత్రే ప్రయత్నించారు.

తను ఫిరోజ్ విషయంలో జోక్యం కలిపించుకోకముందే తనని హత్య చేయడానికి వచ్చారు. అంటే చైనీస్ గూఢచారులకి ఫిరోజ్ తనకి ఫోన్ చేసిన విషయం తెలిసి వుండాలి. లేదా భార్గవప్రసాద్, ఫిరోజ్‌ల సంభాషణ సారాంశం తెలిసి వుండాలి. అంతకుముందే ఫిరోజ్ ఆ పత్రాలు తనకిచ్చి వుండాలని అనుకున్నారా! స్పెషల్ బ్రాంచ్ ఏజంటుని ఎందుకు చంపారు? అతన్ని చంపవలసిన అవసరం ఏం కలిగింది? నళిని యిల్లు ఎందుకు సోదా చేశారు? యిప్పుడు తనని ఎత్తుకొచ్చినదెవరు? ఎందుకు ఆలోచిస్తున్నాడు? హేతువాదంతో అసలు జరిగిందేమిటో వూయించవచ్చునని యుగంధర్ నమ్మకం, అందుకే కళ్ళు మూసుకుని తీవ్రంగా ఆలోచించి గంటన్నర తరవాత కళ్ళు తెరిచాడు. లేచి నిలబడి ఒకసరి వొళ్ళు విరుచుకున్నాడు. నెమ్మదిగా గదిలోంచి బయటికి వెళ్ళి భార్గవప్రసాద్ వున్న గదిలో ప్రవేశించాడు. మాట్లాడవద్దని సంజ్ఞ చేసి, జేబులోంచి కాగితం, కలం తీసి "ఫిరోజ్‌ని గ్రాండ్ హోటల్ దగ్గర దింపడానికి మీరు వెళ్ళినపుడు కారు ఆపగనే అతను దిగి వెళ్ళిపోయాడా లేక మీరూ, అతనూ కాసేపు మాట్లాడుకున్నారా?" అని రాశాడు.

"దాదాపు పావుగంట సేపు మాట్లాడుకున్నాము" జవాబు రాశాడు భార్గవప్రసాద్.

యుగంధర్ తలవూపి. తృప్తిగా నవ్వుకుని భార్గవప్రసాద్ గదిలోంచి బయటికి వెళ్ళాడు.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments